క్లుప్తంగా

నేడు వలంటీర్ పోస్టులకు ఇంటర్వ్యూలు

రాయచోటి అర్బన్ : మున్సిపల్ పరిధిలో ఖాళీగా ఉన్న వార్డు వలంటీర్ పోస్టులకు మంగళవారం ఇంటర్వ్యూలను నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ గంగాప్రసాద్ తెలిపారు. మున్సిపల్ పరిధిలోని 34 వార్డులలో 13 వార్డు వలంటీర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. 13 పోస్టులకు గాను 23మంది ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకున్నట్లు తెలిపారు. దరఖాస్తు దారులకు మంగళవారం సాయంత్రం 3గంటలకు మున్సిపల్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు. దరఖాస్తుదారులు తగు పత్రాలతో ఇంటర్వ్యూలకు హాజరుకావాలంటూ ఆయన కోరారు.

6న ఆసరా సమావేశం

చిన్నమండెం : ఈ నెల 4న జరగాల్సిన వైఎస్ఆర్ ఆసరా సమావేశం ఈ నెల 6వ తేదీకి మార్చినట్లు జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ దేవనాథరెడ్డి తెలిపారు. మండల కేంద్రంలో బెస్తపల్లె క్రాస్ వద్ద ఉన్న మామిడికాయల మండీలో ఈ సమావేశాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ ఆసరా సమావేశానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి పాల్గొననున్నట్లు తెలిపారు. మండల వ్యాప్తంగా ఉన్న నాయకులు, ప్రజాప్రతినిధులు, ఎస్‌హెచ్‌జీ మహిళలు సమావేశంలో పాల్గొని విజయవంతం చేయాలని దేవనాథరెడ్డి కోరారు.

బెటాలియన్ వద్ద చలివేంద్రం ఏర్పాటు



మంచినీటిని అందిస్తున్న కమాండెంటు శ్రీనివాసరావు

సిద్దవటం : ఏపీఎస్పీ 11వ బెటాలియన్ 3వ గేటు వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సోమవారం బెటాలియన్ కమాండెంటు ఎస్. శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిని దృష్టిలో ఉంచుకొని రోడ్డుపై ప్రయాణించే ప్రయాణీకులు, పాదచారుల దాహార్తిని తీర్చేందుకే శుద్ధి జలాలతో చలివేంద్రంను ఏర్పాటు చేశామన్నారు. అసిస్టెంటు కమాండెంట్లు కె. వెంకట్‌రెడ్డి, పి.ఎస్.డి. ప్రసాద్, వి. జయప్రసాద్, ఆర్‌ఐలు, ఆర్ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించేలా చూడండి

రాయచోటి అర్బన్ : ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించేలా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై ఆ పార్టీ నేతలు ఒత్తిడి తీసుకురావాలని ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ బండకింద మనోహర్, ఎంఎస్‌పీ నేత రామాంజనేయులు డిమాండ్ చేశారు. మందాక్రిష్ణ మాదిగ పిలుపు మేరకు సోమవారం రాయచోటిలో బీజేపీ కార్యాలయాన్ని ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ నేతలు ముట్టడించారు. అనంతరం బీజేపీ రాయచోటి అసెంబ్లీ కన్వీనర్ ఎ.శివ గంగిరెడ్డికి వినతిపత్రం సమర్పించారు. బీజేపీ నేత రాజశేఖరరెడ్డి, ఎమ్మార్పీఎస్ మండల నేతలు గుంటిమడుగు ఆనంద్, సి.వి. రమణ, నరసింహులు, బాబుమాదిగ పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందు

చిన్నమండెం : పవిత్ర రంజాన్ మాసంలో ముస్లిం సోదరులకు ఇచ్చే ఇఫ్తార్ విందు మహా పుణ్య కార్యక్రమమని జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ దేవనాథరెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో వైఎస్ఆర్‌సీపీ నాయకులు మయానా జహీర్ ఆలీఖాన్ ఇచ్చిన ఇఫ్తార్ విందులో దేవనాథరెడ్డి పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ఎంతో పవిత్రమైన రంజాన్ మాసంలో దాన ధర్మాలు చేసే పవిత్ర మాసమని తెలిపారు.

వక్ఫ్ బోర్డు సమావేశం

రాయచోటి టౌన్ : వక్ఫ్ బోర్డు ఆస్తులుగా పరిగణించిన వాటిపై ఇతరులకు ఎటువంటి హక్కు ఉండదని అన్నమయ్య జిల్లా వక్ఫ్ బోర్డు అధ్యక్షుడు ఏ. కరీముల్లా తెలిపారు. సోమవారం రాయచోటి ముస్లిం మైనార్టీ నాయకులు, వక్ఫ్ బోర్డు సభ్యులతో కలసి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి మసీదు, దర్గా, ఈద్గా, పీర్ల చావిడి, పీర్ల పంజాలు, ఆషుర్ ఖానాలు, ముసాఫీర్ ఖానాలు, తనియాలు, ముస్లిం స్మశాన వాటికలు, చిల్లాలు, జెండా చెట్టు (కట్టలు) వక్ఫ్ బోర్డు పరిధిలోకి వస్తాయన్నారు. ఇందుకు సంబంధించి 1995లో చట్టం చేశారని తెలిపారు. వక్ఫ్ బోర్డు కిందకి రాని సదరు స్థలాలు, భూములను సభ్యులు గుర్తించి ఈ నెల 30వ తేదీలోపు దరఖాస్తులు అందజేయాలని సూచించారు. అనంతరం వక్ఫ్ బోర్డు సభ్యులు కరీముల్లాను సన్మానించారు.

ముస్లిం, మైనార్టీలపై దాడులను ఆపాలి

రాయచోటి అర్బన్ : ముస్లిం, మైనార్టీలపై రోజు రోజుకు పెరుగుతున్న దాడులను వెంటనే ఆపాలని మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర కార్యదర్శి సగీర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మైనార్టీలపై జరుగుతున్న దాడులపై ఆదివారం రాత్రి జామియా మసీదు వద్ద మైనార్టీలతో కలసి నిరసన ప్రదర్శన చేశారు. ఆయన మాట్లాడుతూ చిత్తూరు జిల్లా వి.కోటలో ఇక్బాల్ అనే వ్యక్తిపై జరిగిన దాడిని ప్రజాస్వామ్య పద్ధతిలో ఖండించిన తమ సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు ఫరూఖ్‌షిబ్లీపై పోలీసులు అక్రమంగా కేసు బనాయించడం తగదన్నారు. దాడికి కారకులను వెంటనే అరెస్టు చేయాలన్నారు.

నేడు వాహనాల వేలం

ములకలచెరువు: అక్రమంగా మద్యం తరలిస్తూ పట్టుబడిన 15 వాహనాలకు మంగళవారం వేలం నిర్వహిస్తున్నట్లు ఎస్ఈబీ సీఐ మల్లిక సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ప్రశాంతంగా ప్రారంభమైన పది పబ్లిక్ పరీక్షలు

- విద్యార్థులకు గదులను చూపించడంలో సహకరించిన ఉపాధ్యాయులు
- నిర్ణీత సమయంలోపే పరీక్షా కేంద్రాలకు చేరుకున్న విద్యార్థులు
- పరీక్షా కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు



రాజంపేట టౌన్: హాల్ టికెట్ నంబర్ చూసుకుంటున్న విద్యార్థులు



ఓబులవారిపల్లె: పది పరీక్షలకు హాజరైన విద్యార్థులు



రామాపురం: ఆదర్శ పాఠశాల వద్ద బందోబస్తు నిర్వహిస్తున్న సీఐ వరప్రసాద్, ఎస్ఐ కొండారెడ్డిలు

రాజంపేట టౌన్ : పది పబ్లిక్ పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. రాజంపేటలోని ప్రభుత్వ హైస్కూల్‌లో రెండు పరీక్షా కేంద్రాలు, మన్నూరు, బోయినపల్లె, ఊటుకూరు, ఉర్దూ జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో, గరల్స్ హైస్కూల్, ఇన్‌ఫ్యాంట్ జీసెస్ హైస్కూల్‌లో ఒక సెంటర్‌ను ఏర్పాటు చేశారు. మండలంలో మొత్తం ఎనిమిది పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. తొలిరోజు జరిగిన తెలుగు పరీక్షకు 1,416 మంది విద్యార్థులు హాజరు కావాల్సివుండగా 1,397 మంది విద్యార్థులు హాజరయ్యారు. 19 మంది గైర్హాజరైనట్లు ఎంఈఓ వెంకటేష్‌నాయక్ తెలిపారు. తొలిరోజు కావడంతో అనేక మంది విద్యార్థులు 8 గంటలకే పరీక్షా కేంద్రాలకు చేరుకున్నారు. 8:30 గంటల నుంచి విద్యార్థులను పరీక్షా కేంద్రంలోకి అనుమతించారు. విద్యార్థులతో పాటు అనేక మంది తల్లిదండ్రులు కూడా పరీక్షా కేంద్రాలకు వచ్చారు. హాల్ టికెట్లను పరిశీలించి కేవలం విద్యార్థులను మాత్రమే పరీక్షా కేంద్రంలోకి పంపించారు. దాదాపు విద్యార్థులందరు కూడా నిర్ణీత సమయంలోపే పరీక్షా కేంద్రంలో తమకు కేటాయించిన గదికి చేరుకున్నారు. పరీక్షా కేంద్రాల వద్ద గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. అర్బన్ సీఐ నరసింహారావు, ఎస్ఐ ప్రసాద్‌రెడ్డి తరచూ పరీక్షా కేంద్రాలను పరిశీలిస్తూ వచ్చారు. విద్యార్థులు ఆరోగ్య పరమైన సమస్యల బారీన పడితే వెంటనే వైద్యం అందించేందుకు అన్ని పరీక్షా కేంద్రాల్లో వైద్య సిబ్బందిని ఏర్పాటు చేశారు.

రామాపురంలో..

రామాపురం : మండలంలోని ఆదర్శ, కస్తూర్బా బాలికల పాఠశాలలో సోమవారం 10వ తరగతి పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. ఆదర్శ పాఠశాలలో 238 మంది విద్యార్థులకు గాను నలుగురు గైర్హాజరు, కస్తూర్బా బాలికల పాఠశాలలో 143 విద్యార్థులకు గాను ఒకరు గైర్హాజరైనట్లు పరీక్షా కేంద్రాల చీఫ్‌లు హరిబాబు, భీలునాయక్‌లు తెలిపారు. లక్కిరెడ్డిపల్లె సీఐ వరప్రసాద్, రామాపురం ఎస్ఐ కొండారెడ్డి పోలీసు బందోబస్తును నిర్వహించారు.

సంబేపల్లెలో..

సంబేపల్లె : మండలంలోని వివిధ పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న విద్యార్థులు సోమవారం దేవపట్ల అంబేడ్కర్ గురుకుల, సంబేపల్లె, దేవపట్ల జెడ్పీ ఉన్నత పాఠశాలల్లోని పరీక్షా కేంద్రాల్లో నిర్వహించిన పదవ తరగతి తెలుగు పేపర్ పరీక్ష ప్రశాంతంగా జరిగాయి. ఈ సందర్భంగా మండలంలోని మొత్తంగా 423 మంది విద్యార్థులకు గాను 422 మంది పరీక్షలకు హాజరు కాగా ఒకరు హాజరుకాలేదని పరీక్ష కేంద్రాల సిబ్బంది తెలిపారు.

ఓబులవారిపల్లెలో..

ఓబులవారిపల్లె : మండలంలో పదవ తరగతి తెలుగు పరీక్ష సోమవారం ప్రశాంతంగా నిర్వహించారు. మండలంలోని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 266 విద్యార్థులకు గాను ఒకరు గైర్హాజరైనట్లు ఎంఈఓ పద్మజ తెలిపారు. ముక్కావారిపల్లె బాలుర గురుకుల పాఠశాలలోని ఏ సెంటర్‌లో 200 విద్యార్థులు, బీ సెంటర్‌లో 164 విద్యార్థులు వంద శాతం హాజరైనట్లు తెలిపారు.

సిద్దవటంలో..

సిద్దవటం : మండల కేంద్రమైన సిద్దవటం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం జరిగిన 10వ తరగతి పరీక్షలు పకడ్బందీగా నిర్వహించామని ఎంఈఓ శంకరయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిద్దవటం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఏ, బి రెండు సెంటర్లను ఏర్పాటు చేశామన్నారు. మొదటి రోజు తెలుగు పరీక్ష మొత్తం విద్యార్థులు 324 మంది రాయాల్సి ఉండగా ముగ్గురు గైర్హాజరైయ్యారన్నారు. పరీక్షా కేంద్రం వద్ద 144 సెక్షన్ అమలులో ఉండటంతో ఎస్ఐ తులసీ నాగప్రసాద్ పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారన్నారు. పరీక్షా కేంద్రాన్ని 10వ తరగతి పరీక్షల జిల్లా అబ్జర్వర్ వెంకటక్రిష్ణారెడ్డి, తహసీల్దారు శంకర్‌రావు, ఎంపీడీఓ ఫణి రాజకుమారి తనిఖీ చేశారు. పరీక్ష ప్రారంభంలోనే ఫ్లయింగ్ స్క్వాడ్, సిట్టింగ్ స్క్వాడ్ వచ్చిందన్నారు.

పెనగలూరులో..

పెనగలూరు : మండలంలో పదోతరగతి పరీక్షలలో భాగంగా సోమవారం మొదటి పరీక్ష ప్రశాంతం జరిగింది. పెనగలూరు జిల్లా పరిషత్ హైస్కూల్, మోడల్ స్కూల్, చక్రంపేట జిల్లా పరిషత్ హైస్కూల్ లలో పదో తరగతి పరీక్షలు భారీ బందోబస్తు మధ్య పకడ్బందీగా నిర్వహించారు.

వందశాతం హాజరైన విద్యార్థులు

గాలివీడు : మొదటిరోజు పరీక్షలలో భాగంగా తెలుగు పరీక్ష ఎలాంటి అవాంతరాలు లేకుండా ప్రశాంతంగా జరిగినట్లు ఇన్‌చార్జ్ ఎంఈఓ చక్రేనాయక్ తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గాలివీడులో మూడు పరీక్షా కేంద్రాలు మంజూరు చేయగా జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో 180 మందికి గాను 180 జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో 220 మందికి 220 మంది విద్యార్థులు, కస్తూర్బా పాఠశాలలో 149 మందికి గాను 149 మందితో వందశాతం విద్యార్థులు తెలుగు పరీక్షకు హాజరయ్యారన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఎస్ఐ వెంకట శివకుమార్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

చిట్వేలిలో..

చిట్వేలి : చిట్వేలిలో పదోతరగతి పరీక్షలు సోమవారం ప్రశాంతంగా జరిగాయి. ఈ మేరకు మండల వ్యాప్తంగా 536 మంది విద్యార్థులకు గాను బి సెంటర్లలో నలుగురు, సీ సెంటర్లలో ఒకరు, మొత్తం ఐదు మంది పరీక్షకు హాజరుకాలేదని ఎంఈఓ మహేశ్వరరావు తెలిపారు. ఎస్ఐ సుభాష్ చంద్రబోస్ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుల్ కాటమయ్య, రమేష్ పాల్గొన్నారు.

లక్కిరెడ్డిపల్లెలో..

లక్కిరెడ్డిపల్లె : మండలంలో పదో తరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం ప్రశాంతంగా జరిగాయని ఎంఈఓ చక్రేనాయక్ తెలిపారు. మండలంలోని మూడు పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామని మొత్తం విద్యార్థులు 453 మందికిగాను ఒకరు హాజరుకాలేదన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద లక్కిరెడ్డిపల్లి సీఐ వరప్రసాద్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు.

అర్జీదారులకు అన్నదానం

రాయచోటి అర్బన్ : అన్నం పరబ్రహ్మ స్వరూపం అని మున్సిపల్ వైస్ చైర్మన్ ఫయాజుర్ రహిమాన్, వైఎస్ఆర్‌సీపీ మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు బేపారి మహమ్మద్‌ఖాన్‌లు అన్నారు. ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్ వద్ద 14వ వారానికి చేరుకుంది. శిబిరంలో అర్జీదారులకు కలర్ రైస్, చికెన్‌తో కూడిన భోజనాన్ని వడ్డించారు. కార్యక్రమాన్ని ప్రారంభించిన వారు మాట్లాడుతూ తమ సమస్యల పరిష్కారం కోసం జిల్లా నలుమూలల నుంచి కలెక్టరేట్‌కు విచ్చేసే అర్జీదారులకు అన్నదానం చేయాలనే ఆలోచన ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డికి రావడం అభినందనీయం అన్నారు. కార్యక్రమంలో అన్నమయ్య జిల్లా వక్ఫ్ బోర్డు డైరెక్టర్ నవరంగ్ నిస్సార్, వైఎస్ఆర్‌సీపీ నేతలు అన్నా సలీం, సుగవాసి శ్యామ్, గువ్వల బుజ్జిబాబు, ఎమ్మెల్యే పీఏ నిస్సార్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

‘ప్రతి కార్యకర్త ఇంట జెండా ఎగురవేయాలి’

రాయచోటి టౌన్ : ఈనెల 6వ తేదీన బీజేపీ (భారతీయ జనతా పార్టీ)ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కార్యకర్తల ఇళ్లపై జెండాను ఎగురవేయాలని ఆ పార్టీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పీటీ ఆంజనేయులు సూచించారు. సోమవారం రాయచోటి పట్టణంలోని ఓ ప్రైవేట్ హోటల్లో జిల్లా కార్యకవర్గ సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. బీజేపీ ఆదేశాల మేరకు ఈనెల 6వ తేదీ పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆ రోజు నుంచి 14వ తేదీ వరకు అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా పట్టణం, పల్లె అనే తేడా లేకుండా ప్రతి కార్యకర్త ఇంటిపై జెండాను ఎగురవేయాలన్నారు. కార్యక్రమంలో గోపాల్ రెడ్డి, అన్నమయ్య జిల్లా ఓబీసీ మోర్చా అధ్యక్షుడు రేపన శివప్రసాద్, జిల్లా ఉపాధ్యక్షుడు గుర్రంకొండ రామాంజనేయులు, ఎంపీటీసీ రావూరి శ్రీనివాసులు, జిల్లా కార్యదర్శి రేపన నరేష్, జానం బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఇళ్ల నిర్మాణంపై ప్రత్యేక దృష్టి



సిబ్బందితో సమీక్షిస్తున్న కమిషనర్ గంగాప్రసాద్

రాయచోటి అర్బన్ : నారాయణరెడ్డిపల్లె జగనన్న కాలనీ లే అవుట్‌లో ఇళ్ల నిర్మాణం త్వరితగతిన పూర్తయ్యేలా చూడాలని మున్సిపల్ కమిషనర్ గంగాప్రసాద్ అధికారులను కోరారు. సోమవారం తన చాంబర్‌లో ఆయన గృహ నిర్మాణశాఖ అధికారులు, వార్డు ఇంజనీరింగ్ అధికారులతో ఇళ్ల నిర్మాణంపై సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ లబ్ధిదారులకు సకాలంలో ఇసుక, సిమెంటు తదితర నిర్మాణ సామగ్రిని సమకూర్చి ఇళ్ల నిర్మాణం వేగంగా చేపట్టేలా ప్రోత్సహించాలన్నారు. నిత్యం ఇళ్ల పనులను పర్యవేక్షించాలన్నారు. బిల్లులు జాప్యం లేకుండా చెల్లించేందుకు త్వరితగతిన ఆన్‌లైన్ చేయాలని సూచించారు. సమీక్షలో హౌసింగ్ డీఈ చంద్రశేఖర్, ఏఈ శివశంకర్, మున్సిపల్ ఆర్ఐ మల్లికార్జున, హౌసింగ్ సిబ్బంది, వార్డు సచివాలయం ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత

పట్టణ పరిధిలో మౌలిక వసతుల కల్పనకు అత్యంత ప్రాధాన్యతను ఇవ్వాలని మున్సిపల్ కమిషనర్ గంగాప్రసాద్ అధికారులకు సూచించారు. సోమవారం ఆయన మున్సిపల్ అధికారులు, సిబ్బందితో కలసి పట్టణంలో పర్యటించి ప్రజల సమస్యలపై ఆరా తీశారు. ప్రజల నుంచి ఫోన్‌కాల్స్ ద్వారా, స్పందన ద్వారా అందే ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆయన సచివాలయం సిబ్బందిని కోరారు. 34వ వార్డు మునెప్పగారి పల్లె వద్ద త్వరలో డ్రైన్ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలంటూ కోరారు. ప్రజలకు తాగునీరు, విద్యుత్ దీపాలు, పారిశుద్ధ్యం తదితర మౌలిక వసతుల కల్పనలో అధికారులు వెంటనే స్పందించాలంటూ ఆయన ఆదేశించారు.

చిరుధాన్యాలు ఎంతో ఉపయోగకరం



చిట్వేలి: పిల్లలకు బహుమతులు అందిస్తున్న తహసీల్దార్ మురళీకృష్ణ తదితరులు

ఓబులవారిపల్లె : చిరుధాన్యాలు ఉపయోగించడం ద్వారా గర్భిణులు, బాలింతలకు రక్తహీనతను తగ్గిస్తూ వారిని ఆరోగ్యంగా ఉంచేందుకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అని వైద్యాధికారి గురుమహేష్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యలయంలో ఐసీడీఎస్ అధ్వర్యంలో పోషణ్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అంగన్‌వాడి సెంటర్ల ద్వార గర్భిణులకు, బాలింతలకు ,పిల్లలకు పౌష్టిక ఆహారం అందిస్తున్నారని తెలిపారు. తహసీల్దార్ పీర్ మున్ని మాట్లాడుతూ చిరుధాన్యాలు ప్రస్తుతం మార్కెట్‌లో విరివిగా లభిస్తున్నాయని అందరూ చిరుధాన్యాలు వాడాలని సూచించారు. అనంతరం హెల్తీ బేబీ పోటీలు నిర్వహించి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ జయపాల్‌రెడ్డి, ఆర్ఐ రామ్మోహన్‌నాయుడు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్‌లు అనసూయమ్మ, జయలక్ష్మి, అంగన్‌వాడీ నిర్వాహకులు పాల్గొన్నారు.

పిల్లల ఆరోగ్యంపై దృష్టి పెట్టాలి

చిట్వేలి : పిల్లల ఆరోగ్యం, పోషణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని తహసీల్దార్ మురళీకృష్ణ అంగన్‌వాడీ కార్యకర్తలకు సూచించారు. ఎంపీడీఓ సభా భవనంలో సోమవారం పోషణ పఖ్వాడా సంబరాలలో భాగంగా హెల్తీ బేబీ కార్యక్రమాన్ని ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ వారు చిరుధాన్యాలతో చేసిన వంటకాల స్టాల్స్‌ను అధికారులు పరిశీలించి ఐసీడీఎస్ సిబ్బందిని అభినందించారు. అనంతరం వెల్ బేబీ షోను నిర్వహించి అన్ని పారా మీటర్స్‌లో పిల్లలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మోహన్, ఎంఈఓ మహేశ్వరరావు, డాక్టర్ అన్సారీ, చిట్వేలి సీడీపీఓ రాజేశ్వరి, హెల్త్ సూపర్‌వైజర్ విజయ్‌కుమార్, ఐసీడీఎస్ గ్రేడ్- 1 సూపర్‌వైజర్ నిర్మల, గ్రేడ్- 2 సూపర్‌వైజర్ సుబ్బలక్ష్మి, కార్యకర్తలు సుధామణి, సృజన, రాధ పాల్గొన్నారు.

చిరుధాన్యాలపై అవగాహన

పుల్లంపేట : పోషణ్ పఖ్వాడా సంబరాలలో భాగంగా సోమవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో చిరుధాన్యాలపై స్థానిక ఎంపీడీఓ కార్యాలయం నందు అంగన్‌వాడీ టీచర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీ సెంటనర్లు చిన్న పిల్లలు, బాలింతల పౌష్టిక ఆహార కల్పనపై ప్రత్యేక దృష్టి సారిస్తుందన్నారు. అనంతరం చిరుధాన్యాలతో తయారు చేసిన ఆహార పదార్థాలను ప్రదర్శించారు. తహసీల్దార్ నరసింహకుమార్, సర్పంచ్ ఆకేపాటి శ్రీనివాసులు రెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నిర్మలదేవి, మణెమ్మలు పాల్గొన్నారు.

ముంపు గ్రామాల సమస్యలు పరిష్కరించండి



సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

ఓబులవారిపల్లె : మంగంపేట మైనింగ్ వల్ల ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని రైల్వే బోర్డు మెంబర్ తల్లెం భరత్‌కుమార్‌రెడ్డి ఆయా గ్రామాల వాసులతో కలిసి సబ్‌కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంగంపేట డేంజర్ జోన్ పరిధిలో ఉన్న కాపుపల్లె, హరిజనవాడ, అరుంధతివాడ గ్రామాలకు సంబంధించిన డీపీఆర్ సిద్ధం చేసి, 2013 చట్టం ప్రకారం పరిహారం చెల్లించి పునరావాసం కల్పించాలని కోరారు. ఆర్ అర్ సెంటర్- 1లోని సర్వే నెంబరు. 1098లో క్రిస్టియన్ల స్మశాన వాటికను చదును చేయించి అందుబాటులోకి తీసుకువచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. జగనన్న లే అవుట్‌లో అర్హులందరికీ ఇంటిపట్టాలు ఇవ్వాలని కోరారు. ఈ సమస్యలపై సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

స్పందన వినతులను సకాలంలో పరిష్కరించాలి

రాజంపేట : స్పందన వినతులను సకాలంలో పరిష్కరించాలని సబ్‌కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ అన్నారు. సోమవారం తన చాంబరులో వివిధ వర్గాల నుంచి స్పందన కార్యక్రమంలో భాగంగా వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిబంధనల మేరకు వినతులను పరిష్కరిస్తామన్నారు. మండల స్థాయిలో తహసీల్దారులు ఎప్పటికప్పుడు స్పందనలో వచ్చే వినతులను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. మండల స్థాయిలో పరిష్కారం కానప్పుడు సబ్‌కలెక్టరేట్ స్థాయిలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

ఆకట్టుకున్న అర్జునుడి తపస్సు కార్యక్రమం

చిన్నమండెం : మండల పరిధిలోని కేశాపురం గ్రామం రెడ్డివారిపల్లెలో జరుగుతున్న మహాభారత యజ్ఞంలో భాగంగా సోమవారం అర్జునుడి తపస్సు కార్యక్రమం అంగరంగ వైభవంగా జరిగింది. ప్రముఖ భాగవతారిణి శారదచే చూడముచ్చటగా మహాభారతం కార్యక్రమం సాగుతోంది. శుక్రవారం పాండవ అరణ్యవాసం , అర్జునుడి తపస్సు కార్యక్రమాలు జరగ్గా సింగిల్ విండో అధ్యక్షుడు గోవర్దన్‌రెడ్డి టెంకాయ కొట్టి కార్యక్రమాన్ని ప్రారంభించగా పెద్ద ఎత్తున భక్తులు ఈ కార్యక్రమాలల్లో పాల్గొన్నారు. దాతలు నర్సరీ రమణ, బాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదానంలో భక్తులు పాల్గొన్నారు.

ఏఐటీఎస్‌లో సీజీఆర్ టాలెంట్ మీట్

రాజంపేట : ఏఐటీఎస్‌లో సోమవారం సీజీఆర్ టాలెంట్ మీట్ ఘనంగా ప్రారంభమైంది. టాలెంట్ మీట్ ప్రారంభోత్సవ సభకు ఎస్వీ యూనివర్సిటీ కాలేజీ ఆఫ్ ఇంజనీరింగ్ ప్రిన్సిపాల్ డా.ఆర్‌వీఎస్ సత్యనారాయణ జ్యోతి ప్రజల్వన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజీఆర్ టాలెంట్ మీట్‌లో పాల్గొనడం వల్ల విద్యార్థులు పుస్తకంలో లేని నూతన విషయాలను తెలుసుకోగలరన్నారు. విభిన్నమైన టెక్నాలజీని విద్యార్థులు పరస్పరం తెలుసుకుంటారన్నారు. ఏఐటీఎస్ వైస్‌చైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు ఏఐటీఎస్ అధినేత చొప్పాగంగిరెడ్డి, ఈడీ చొప్పా అభిషేక్‌రెడ్డిలు అనేక కార్యక్రమాలను తీసుకొస్తున్నారన్నారు.

పంచాయతీ టోల్‌గేటును రద్దు చేయాలి

చిట్వేలి : పంచాయతీ వారు అనదంగా వసూలు చేస్తున్న టోల్‌గేటును రద్దు చేయాలంటూ మ్యాక్సీ, ఆటో, జీపు, తోపుడు బండ్ల యూనియన్లు, సీఐటీయూ అనుబంధ సంఘాలు సోమవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యాలయం వద్ద వారు మాట్లాడుతూ రోజురోజుకు పెరిగిపోతున్న నిత్యావసరాల ధరలు, పెట్రోల్, డీజిల్ ధరలతో కుటుంబ పోషణ భారమై బతుకు సాగిస్తున్న తమపై అదనంగా టోల్‌గేటు వసూలు చేయడం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు. టోల్ విషయమై పంచాయతీ వారు పునరాలోచించాలని వారు విజ్ఞప్తి చేశారు.

క్షయ వ్యాధిగ్రస్తులకు సహకరిద్దాం

లక్కిరెడ్డిపల్లె : క్షయ వ్యాధిగ్రస్తులను ఆదరించి వారికి సహకరించాలని కమ్యూనిటీ ఆస్పత్రి డెంటల్ డాక్టర్ కీర్తిరెడ్డి పేర్కొన్నారు. రాయచోటి లయన్స్ క్లబ్ వారి ఆధ్వర్యంలో సోమవారం క్షయ వ్యాధిగ్రస్తులకు లయన్స్ క్లబ్ అధ్యక్షుడు మహమ్మద్ న్యూట్రీషన్ పోషక పదార్థాలను పది మందికి కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసుపత్రిలో 15 మంది టీబీ రోగులకు డాక్టర్ శ్యామసుందర్ రెడ్డి, కీర్తిరెడ్డిలు దత్తత తీసుకొని వారికి రూ.700లు విలువ జేసే న్యూట్రీషన్ ఫుడ్‌ను అందజేస్తున్నారని ఆయన అన్నారు. వరుసగా ఐదో నెలలుగా ఈ న్యూట్రీషన్ ఫుడ్ రోగికి ఎంతోబలం ఇస్తుందని, ఇలాగే తమ వంతు సహాయ సహకారాలు ప్రతి నెల అందిస్తామన్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరిటెండెంట్ నీలోఫర్ బేగం, డాక్టర్ శ్రీనివాసరెడ్డి, డాక్టర్ సుభాషిణి, జీవన్ కుమార్, ఎల్‌టీ ప్రసాద్, టీబీ యూనిట్ సూపర్‌వైజర్ హరి, సిబ్బంది పాల్గొన్నారు.

సమష్టి కృషితోనే మండలాభివృద్ధి

గాలివీడు మండల సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ జల్లా సుదర్శన్‌రెడ్డి




మాట్లాడుతున్న ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి

గాలివీడు : మండలంలోని అధికారులు, ప్రజాప్రతినిధుల సమష్టి కృషితోనే అభివృద్ధి జరుగుతుందని ఎంపీపీ జల్లా సుదర్శన్‌రెడ్డి అన్నారు. ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డిల సహకారంతో ప్రజలకు అనునిత్యం అందుబాటులో ఉంటూ ఎప్పటికప్పుడు సమస్యలను పరిష్కరిద్దామని ఎంపీపీ అన్నారు. సోమవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ శేఖర్ నాయక్ ఆధ్వర్యంలో ఎంపీపీ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ, డిప్యూటీ తహసీల్దార్‌లు పాల్గొన్నారు. ముందుగా అజెండాలో పొందుపరిచిన అంశాలను శాఖలవారీగా పురోగతి వివరాలు, పనులు అమలవుతున్న తీరును సభ్యులకు వివరించారు. గ్రామ పంచాయతీలలోని పాత, కొత్త పెండింగ్, విద్యుత్ బకాయిలను సర్పంచ్‌లకు సంబంధం లేకుండా ఇక నుంచి ప్రభుత్వమే చెల్లించాలని, ఈ విషయంపై ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని నిర్ణయించారు. 2022- 23 సంవత్సరానికి సంబంధించిన 15వ ఆర్థిక సంవత్సరం పెండింగ్ బకాయిలను విడుదల చేయాలని కోరారు. మండలంలో తాగునీటి సమస్యపై ఎంపీపీ మాట్లాడుతూ వేసవికాలం వచ్చినందున గ్రామాలలో నీటి సమస్య తలెత్తకుండా చూసుకోవాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులు, అధికారులదేనన్నారు. అలానే విద్యుత్ సమస్య తలెత్తకూడదని సూచించారు. గ్రామాలలో పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్వహణపై ప్రజాప్రతినిధులు వారివారి గ్రామాలలో ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. త్వరలో అన్ని గ్రామాలలో తాగునీటి పైపులైన్ పనులు పూర్తి చేయిస్తామన్నారు. జగనన్న సంపూర్ణ గృహ హక్కు పథకాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఎటువంటి అపోహలు నమ్మవద్దని ఎంపీపీ పేర్కొన్నారు. అనంతరం వివిధ శాఖల అధికారులు తమ ప్రగతి నివేదికలను చదివారు. పేద ప్రజలకు ఉపాధి హామీ పథకం ఒక వరం లాంటిదని, గ్రామాలలో 100 రోజులు పనిదినాలను పూర్తయ్యేలా చూడాలని, రైతులకు ఉపయోగపడేలా పనుల అనుమతులు మంజూరు చేయించుకొని పనులు చేపట్టాలని ఎంపీపీ ఆదేశించారు. అలాగే రాయచోటి నుంచి వయా వరిగ, కాటిమాయకుంట, గుంటిమడుగు, నూలివీడు మీదుగా గాలివీడుకి ఆర్టీసీ బస్‌ను నడిపే విధంగా చర్యలు తీసుకోవాలని ఆర్టీసీ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత అడ్మిషన్లు

పెనగలూరు : మండలంలోని ప్రైవేటు పాఠశాలల్లో ఒకటో తరగతికి పేద విద్యార్థులకు ఉచితంగా అడ్మిషన్లు కల్పించనున్నట్లు ఎంఈఓ జయవేలు, ఎంపీడీఓ వరప్రసాద్‌లు అన్నారు. సోమవారం వారు ఎంపీడీఓ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేద, బలహీన వర్గాల విద్యార్థులకు మెరుగైన విద్యను అందించేందుకు ప్రభుత్వం ప్రైవేటు పాఠశాలల్లో ఒకటో తరగతికి ఉచితంగా అడ్మిషన్లు చేపట్టాలని ఆదేశించిందన్నారు. 2023- 24 విద్యా సంవత్సరానికి పెనగలూరు మండలంలోని 7 ప్రైవేటు పాఠశాలల్లో 40 ఒకటో తరగతి విద్యార్థులకు అడ్మిషన్లు ఇస్తామన్నారు. ఈనెల 10వ తేదీలోపు పేద, బలహీనవర్గాల వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొని ఎంఈఓ కార్యాలయంలో దరఖాస్తు ఫారాలను సమర్పించాలన్నారు. మండలంలో ఇన్‌ఫ్యాంట్ జీసస్ స్కూల్‌లో 4 సీట్లు, ఎస్ఎస్‌వీబీఎస్ ఇండ్లూరు పాఠశాలలో 5 సీట్లు, హీరా యూపీఎస్ ఓబిలి పాఠశాలలో 18 సీట్లు, రాఘవేంద్ర ప్రైవేటు పాఠశాలలో రెండు సీట్లు, సాయి వికాష్ పాఠశాలలో 11 సీట్లు, రాజమాత యూపీ పాఠశాలలో ఒకసీటు కేటాయిస్తామన్నారు. మారుమూల గ్రామాల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. కార్యక్రమంలో పెనగలూరు జెడ్పీహెచ్ఎస్ ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయుడు పి.ఎల్లయ్య, ఏఓ పద్మభూషన్ రెడ్డి, ఎంఐఎస్ కో- ఆర్డినేటర్ విజయకుమార్, ఏపీఎం నిరంజన్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రమణ, సీఆర్‌పీ బాదుషా తదితరులు పాల్గొన్నారు.

సులభ్ కాంప్లెక్స్ నిర్మాణానికి చర్యలు



సులభ్ క్లాంపెక్స్ నిర్మాణ స్థలాన్ని పరిశీలిస్తున్న ఎంపీపీ

నందలూరు(రాజంపేట) : నందలూరు బస్టాండు సర్కిల్‌లో ప్రయాణీకులకు సౌకర్యాల కల్పన దిశగా చర్యలు తీసుకుంటామని ఎంపీపీ మేడా విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. సోమవారం నందలూరు బస్‌షెల్టర్ పక్కన ఉన్న ఖాళీ స్థలంలో సులభ్ క్లాంపెక్స్ నిర్మాణానికి స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత కొన్ని దశాబ్దాలుగా నందలూరు బస్టాండు సర్కిల్‌లో మహిళలు, వయో వృద్ధులు, పురుషులకు యూరినల్స్ లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పుడు ఆ పరిస్థితిలేదని యుద్ధ ప్రాతిపదకన సులభ్ క్లాంపెక్స్ నిర్మించాలని సర్పంచ్ సూర్యనారాయణను ఆదేశించామన్నారు. కార్యక్రమంలో జిల్లా వక్ఫ్ బోర్డు సెక్రటరీ అమీర్, కో- ఆప్షన్ సభ్యుడు కలీం, బీసీ నాయకులు తుమ్మల శ్రీధర్‌గౌడ్, విజయుడు, చల్లపాటి నరసింహశెట్టి, టంగుటూరు ముస్లిం కమిటీ ప్రతినిధి షావలీ తదితరులు పాల్గొన్నారు. కాగా స్థల పరిశీలనలో పంచాయతీరాజ్ ఇంజనీరు రవికుమార్, ఏఈ సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

‘అక్రమార్కులపై చర్యలు తీసుకోండి’

రాయచోటి అర్బన్ : నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి భూ ఆక్రమణలకు పాల్పడుతున్న వ్యక్తులు, వారికి సహకరిస్తున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని బాధితులు సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. సర్వేనంబరు 477లో ఉన్నభూమిని తమ గ్రామానికే చెందిన ఒక పార్టీ నేత ఆక్రమించుకున్నాడన్నారు. రిజిస్టర్ ఆఫీసు అధికారుల సహాయంతో కార్యాలయంలోని భూమికి సంబంధించిన రికార్డులను సైతం చించివేశాడని పెద్దకాలవపల్లెకు చెందిన బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే సదరు నేతతోపాటు సహకరించిన అధికారులపై చర్యలు తీసుకోవాలంటూ కోరారు. వారితో పాటు ఆమేరకు స్పందనలో అధికారులకు అర్జీని సమర్పించారు. ఇదే పద్ధతిలో 699 సర్వే నంబరులోకి తమ ఆస్థిని సైతం మరోనేత ఆక్రమించినట్టు ఫిర్యాదు చేశారు.